క్లుప్తంగా

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

సదుం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి ఆదివారం తెలిపారు. ఎంపీసీ, ఎంబైపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ ఇంగ్లిషు, తెలుగు మీడియం గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం పలు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించామని, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సదుం: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని రిటైర్డ్ హెచ్ఎం కృష్ణారెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు.

ఉగ్రవాదులను ఏరివేయాలి



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నేతలు

వి.కోట: ఉగ్రవాదులను సమూలంగా ఏరివేయాలని వారికి అన్నివిధాలా సహకరిస్తున్న పొరుగు దేశానికి కేంద్రం గట్టిగా బుద్ధిచెప్పాలని మండల అఖిలపక్ష నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో మూడు రోజుల క్రితం పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిపై ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. నేతలు ధవనం భక్త, శ్రీనివాసులు, శశికళ, కుమార్‌రాజా, వేణుఆచారి, జగదీష్, ఖలీల్, నిజాం, సలీం, నటరాజ్, దొరస్వామి పాల్గొన్నారు.

బోయకొండ ఆలయానికి మోటారు వితరణ



బోరుకు మోటారు అమర్చి పరిశీలిస్తున్న దాతలు, ఈఓ ఏకాంబరం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయానికి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన బోరుకు అవసరమైన మోటారు, పైపులు ఇతర సామగ్రిని ఆదివారం దాతలు వితరణగా ఇచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రామగుండహళ్లి, యల్హంక, హుబ్లీకి చెందిన కెంపన్న, ప్రకాష్, గజేంద్ర, మల్లికార్జున మిత్ర బృందం రూ.2.5 లక్షల విలువ చేసే వస్తువులను అందజేసినట్లు ఈఓ పేర్కొన్నారు. దాతలను ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి పూజలు చేయించి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రాదాలు అందజేసి సత్కరించారు.

ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం

బంగారుపాళెం: విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని సీఐ శ్రీనివాసులు అన్నారు. బంగారుపాళెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ వళ్లెమ్మ, కానిస్టేబుళ్లు అనిత, ఉమాశంకర్, సురేంద్ర ఇటీవల చిత్తూరు, పుంగనూరు, సదుం పోలీస్‌స్టేషన్లకు బదిలీపై వెళ్లారు. బదిలీ అయిన వీరిని ఆదివారం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలలపాటు తనిఖీలు



రైలులో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసు బృందం

చిత్తూరు కార్పొరేషన్: ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లో రెండు నెలలు తనిఖీలు చేయనున్నట్లు జీఆర్పీ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రైల్వేస్టేషన్‌లో, రైలులో ఆదివారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్‌తో అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రయాణికుల లగేజీలను పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు కొనసాగించనున్నట్లు, ప్రయాణికులు సహకరించాలని ఎస్ఐ వివరించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

క్రీడల్

- పాఠశాలల్లో కానరాని క్రీడా మైదానాలు
- పాఠశాలలకు అందని క్రీడా నిధులు
- ఎంపిక పీఈటీల సొంత ఖర్చుతోనే పోటీలు
- దాతలు, టీచర్లు కనికరిస్తేనే ఆటలు
- ఆటలకు ప్రభుత్వ ప్రోత్సాహమేదీ?



నూనేవారిపల్లి వద్ద చెరువులో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు.(ఫైల్)

పలమనేరు: ఒలింపిక్స్‌లో మనకంటే చిన్నచిన్న దేశాలు సైతం పథకాల పట్టికలో దూసుకెళుతుంటే సువిశాలమైన మన దేశం మాత్రం అరకొర పతకాలను సాధించడం మనం చూస్తూనే ఉన్నాం. దీనికి కారణం క్షేత్రస్థాయిలో క్రీడలపట్ల నిర్లక్ష్యం, అవసరమైన సౌకర్యాలు లేకపోవడమే. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి ఉండి పలు ఆటల్లో మంచి ప్రతిభ చూపే మెరికల్లాంటి క్రీడాకారులున్నారు. అయితే ఇలాంటి మట్టిలో మాణిక్యాలకు అవసరమైన చేయూత కరువై వారు అంతటితోనే ఆగిపోతున్నారు. ఆటలంటే మక్కువ ఉన్న ఎందరో పిల్లలు విశేష ప్రతిభతో ముందుకు దూసుకెళుతున్నా వారిని ప్రోత్సహించే వారే లేరు. పోనీ ప్రభుత్వం నుంచి ఏదైనా ఆదరణ ఉందా అంటే అదీ లేదు. కనీసం సర్కారు బడులకు క్రీడా మైదానాలు లేవు. క్రీడాపరికరాల కొనుగోళ్లకు ప్రత్యేకంగా నిధులు రావడం లేదు. సంబంధిత హెచ్ఎంలు లేక దాతలు సాయం చేస్తే తప్ప క్రీడా పరికరాలు రానట్టే. దీంతో పాడైన క్రీడావస్తువులతో, చాలీ చాలని ప్లేగ్రౌండ్‌లో విద్యార్థులు ఆటలాడుకోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వం తరచుగా స్కూల్‌గేమ్స్ నిర్వహించింది. ఇది కాకుండా గ్రామీణ క్రీడాకారులను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రాలాంటి పోటీలను సైతం నిర్వహించి క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించింది.

కానరాని క్రీడా మైదానాలు

నియోజకవర్గంలో 513 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 50వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ బడుల్లో సగానికిపైగా బడులకు క్రీడామైదానాలు లేవు. కొన్ని చోట్ల ఉన్నా అవి అంతంతమాత్రమే. మరికొన్ని పాఠశాలల్లో చెరువుల్లోనూ, బీడుగా ఉన్న చేలల్లోనూ పిల్లలు ఆటలాడుకోవాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని హైస్కూళ్లలో పలు రకాల క్రీడలకు సంబంధించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడే ఆటగాళ్లు 135 మంది దాకా ఉన్నట్టు సమాచారం. వీరికి తగిన ప్రోత్సాహం కరువైంది.

ప్రత్యేకంగా నిధులంటూ లేవట

ప్రాథమిక పాఠశాలలకు ప్లేగ్రౌండ్‌లు అసలు లేవు. హైస్కూళ్లలో మాత్రం ఏటా క్రీడలను తూతూమంత్రంగానే నిర్వహిస్తుంటారు. దీంతోపాటు జోనల్స్ పోటీలు జరుగుతాయి. విద్యాశాఖ నుంచి పాఠశాలలకు క్రీడల కోసం ప్రత్యేకంగా నిధులంటూ ఏమీ రావు. ఏదేనీ ఇతర గ్రాంట్‌లలో కొంత వెచ్చించి తూతూ మంత్రంగా క్రీడా వస్తువులను కొనుగోలు చేసుకోవాల్సిందే. లేదా దాతలెవరైనా స్పందిస్తే క్రీడా వస్తువులను తెచ్చుకోవచ్చు. ప్రస్తుతం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సాగుతున్న జోనల్స్ పోటీలను సైతం పీఈటీ, పీడీలు దాతల సాయంతోనే నిర్వహిస్తుండడం గమనార్హం. ప్రభుత్వం ఇప్పుడైనా దృష్టి పెట్టాలి.



గత ప్రభుత్వంలో పలమనేరులో ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

మైదానాల అభివృద్ధిని చేపట్టాలి



పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 900 మందికిపైగా విద్యార్థులున్నారు. క్రీడా మైదానం కేవలం 20 సెంట్లు కూడా లేదు. బడిలో జిల్లా, రాష్ట్ర స్థాయికి ఆడే పిల్లలున్నారు. సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రమే. బడుల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేసి విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంపొందిస్తే మన దేశానికి ప్రపంచస్థాయిలో పతకాలు వస్తాయి.

–సుభాన్, 1983 పూర్వవిద్యార్థుల సంఘ సభ్యుడు, పలమనేరు

క్రీడలకు నిధులు కేటాయించాలి..



సాధారణంగా స్కూల్ గేమ్స్‌కు సంబంధించి లేదా ఇతర క్రీడలకు ప్రభుత్వ బడులకు ప్రత్యేకంగా నిధులంటూ ఏమీ రావు. ఇప్పుడు వివిధ క్రీడా పోటీల్లో జరుగుతున్న మండల స్థాయి ఎంపికలు సైతం ఆయా పాఠశాల పీడీ, పీఈటీల సాయంతో జరుగుతున్నాయి. ఇక సర్కారు బడుల్లో క్రీడా మైదానాలు చాలావరకు లేవు. ఇలాంటి అసౌకర్యాల నడుమ జాతీయ క్రీడాకారులు ఎలా పుట్టుకొస్తారు.

–చిట్టి, వెటరన్ క్రికెటర్, క్యాటిల్‌ఫామ్

నోటీస్ బోర్డు

ఎల్లమ్మ మండల పూజ రేపు



ఎల్లమ్మ ఆలయం

పులిచెర్ల(కల్లూరు): వగ్గలవారిపల్లె సమీపంలో కొత్తగా నిర్మించిన ఎల్లమ్మ మండల పూజ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. 45రోజులు ఈ ఆలయంలో నిత్యం పూజలు నిర్వహించిన అనంతరం మండల పూజ నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకోసం ఆలయంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 6–9గంటల మధ్య మండల పూజ, అమ్మవారికి శాంతి హోమం, మహాభిషేకం, ప్రత్యేక అలంకరణ, దివ్యదర్శనం అనంతరం భక్తులకు భోజన ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

1న రైతు ఉత్పత్తిదారుల సమావేశం

పులిచెర్ల(కల్లూరు): మంగళంపేటలో మే1న రైతు ఉత్పత్తిదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు, కార్యదర్శి జి.మునిరత్నం, ఎస్.ముర్వత్‌బాషా తెలిపారు. ఈసంఘం ద్వారా రైతులకు వ్యవసాయంపై సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు అనేక సేవలు అందిస్తున్నారు. కన్యకాపరమేశ్వరి కల్యాణ మండలంలో జరిగే సమావేశానికి రైతులందరూ హాజరై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.



గురువులతో పూర్వవిద్యార్థులు

అపూర్వ సమ్మేళనం



సన్మానం అందుకున్న రిటైర్డ్ గురువులు

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్‌లో 2004–2005 సంవత్సరం పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ముందుగా తమకు విద్యాబోధన చేసిన రిటైర్డ్ గురువులు సదాశివరెడ్డి, మనోహర్‌రెడ్డి, సుబ్రమణ్యం, నాగమణి, ఉమాదేవి, మాధురి, మున్నా, నజీర్, ముస్తఫా, రఫిక్‌లకు సన్మానం చేసి, జ్ఞాపికలు బహూకరించి ఆశీర్వాదాలు పొందారు. అలాగే 20 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు నేడు అనేక రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. సహపంక్తి భోజనాలతో చిన్ననాటి మధుర స్మృతులను తలుచుకున్నారు. పూర్వవిద్యార్థులు సుమళ, పరిమళ, భారతి, మాధవి, గాయత్రి, నవీన్, బాలాజి, అజయ్, వెంకటస్వామి, సురేష్, షామీర్‌లాల్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



టీఎన్ కుప్పంలో గంగిరెడ్డి సాగు చేసిన పంట వద్ద మార్కెటింగ్ శాఖాధికారులు

బైరెడ్డిపల్లె: వర్షాలు లేక అరకొర నీటితో సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పొలాల్లోనే వదిలేస్తూ పారబోస్తున్న రైతులను ఆదుకోవాలని ఆదివారం 'పంట..గిట్టుబాటు లేక తంటా' అనే కథనం సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైంది. దీంతో ఆదివారం ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖాధికారులు పరమేశ్వరన్, సంజీవ్ కుమార్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. మండలంలోని టీఎన్‌కుప్పం గ్రామానికి చెందిన గంగిరెడ్డి టమాట పంటను ఎందుకు పారబోయాల్సి వచ్చిందో వివరాలను అడిగి తెలుసుకున్నారు. గిట్టుబాటు ధరలు లేక పారబోయాల్సి వచ్చిందని రైతు గంగిరెడ్డి వారి ఎదుట ఏకరవుపెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఉద్యానవనశాఖాధికారులు మాట్లాడుతూ గత ఏడాది ఈ సీజన్‌లో టమాట గిట్టుబాటు ధరలు బాగా ఉండడంతో టమాట పంట విస్తీర్ణం పెరిగిందన్నారు. వేసవి పంట నుంచి టమాట కోతలు ప్రారంభం కావడంతో నాణ్యమైన కాయలకు ధరలు ఉన్నాయని, నాణ్యత లోపించిన కాయలకు ధరలు పలకడం లేదన్నారు. నాణ్యత లేని టమాటాలను మొగిలి వద్ద ఉన్న శ్రీని ఫుడ్స్, బంగారుపాళ్యం– అరగొండ రోడ్డు లోని జీసీఆర్ ఫుడ్స్, ఎఫ్–3 ఫుడ్స్ ఫ్యాక్టరీల్లో కిలో రూ.5.50 చొప్పున కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోలాహలం.. నూర్‌షావలి ఉరుసు

- నేటితో ముగింపు



కిటకిటలాడుతున్న ఉరుసు

పుంగనూరు: పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై వెలసిన నూర్‌షావలిబాబా ఉరుసు మూడవ రోజూ కోలాహలంగా సాగింది. ఆదివారం రాత్రి ఖవ్వాలి పాటల పోటీలతో ఉరుసు ప్రాంగణం హోరెత్తించింది. వందలాది మంది ముస్లింలు, హిందువులు ఉరుసులో పాల్గొన్నారు. రాత్రి ఖవ్వాలి పాటల పోటీలు ఉర్రూతలూగించాయి. ఉరుసు సోమవారంతో ముగియనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం అన్నదానంతో ఉరుసును ముగించనున్నారు. ఈ మేరకు దర్గా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వేడుకగా అమావాస్య పూజలు



విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయంలో ఆదివారం వైభవంగా అమావాస్య పూజలను నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా తీర్చిదిద్దారు. ప్రతినెలా ఆనవాయితీగా వస్తున్న ఈ పూజలకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గిట్టుబాటు ధర లేక పొలాల్లోనే దోస



రొంపిచెర్ల మండలంలో పొలాల్లో వదిలి వేసిన దోస పంట

రొంపిచెర్ల: చిత్తూరు జిల్లాలోని రొంపిచెర్ల మండలంలో రైతులు సాగు చేసిన దోస పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు పంటను పొలాల్లోనే వదిలేశారు. దీంతో దోస పంట పొలాల్లో కుళ్లుతోంది. రూ.లక్షల ఖర్చు చేసి పంట సాగు చేస్తే ధరలు లేకపోవడంతో దోస రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఈ ఏడాది 840 ఎకరాల్లో రూ.8.50 కోట్ల పెట్టుబడి పెట్టి సాగు చేసినా కనీసం ఒక పైసా కూడా చేతికి రాలేదని అన్నారు. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని లబోదిబో అంటున్నారు. రైతులు పండించిన వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెపుతున్న ప్రభుత్వంగానీ, అధికారులుగానీ అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా సమత సైనిక్ దళ్ పార్టీ ముందుకు వెళుతోందని ఆ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. సమత సైనిక్ దళ్ పార్టీ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఈ పార్టీ తరఫున పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్నామని చెప్పారు. పల్లెల్లో అంబేడ్కర్ ఆశయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వందేళ్ల కార్యక్రమ నిర్వహణకు చిత్తూరు నగరంలోని అంబేడ్కర్ భవనంలో చోటు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఉపాధ్యక్షుడు రాజబాబు, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో నాగుపాము



పామును చంపి చూపిస్తున్న స్నేక్ క్యాచర్

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం రాత్రి నాగుపాము హల్‌చల్ చేసింది. ఇమ్యునైజేషన్ నిల్వ ఉంచే గది ముందు నుంచి ఓపీ నిర్వహించే హాలులోకి పాము వెళ్లేందుకు నెమ్మదిగా బుసలు కొడుతూ వెళ్లసాగింది. పక్క గదిలోకి వెళ్లేందుకు రాత్రి డ్యూటీలో ఉన్న నర్సు రమ్య పామును గమనించి అక్కడే వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వెంకటరమణకు తెలిపింది. వెంటనే పాము కదలికలను గమనిస్తూ స్నేక్ క్యాచర్ గుర్రప్పను, వెంకటరమణ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పామును పట్టేందుకు యత్నించగా పాము తప్పించుకొని మరో గదిలోకి వెళ్లడానికి యత్నించగా కొట్టి చంపేశారు. పెద్దపామును చూసిన సిబ్బంది భయంతో హడలిపోయారు. రోగులున్న గదిలోకి వెళ్లి ఉంటే పరిస్థితి ఏమిటని భయభ్రాంతులకు గురయ్యారు. కాగా చుట్టుపక్కల పిచ్చిమొక్కలు ఏపుగా ఉన్నాయని వీటిని అధికారులు ఇకనైనా స్పందించి తొలగించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



నాగుపాము

ఆదాయం పెంపుపై కసరత్తు

- గుడుపల్లె మండలంలో పలు పంచాయతీల చేర్పు
- 2వ వార్డులోని అటవీ గ్రామాలు తొలగింపు
- కుప్పం మున్సిపాలిటీ ఆదాయానికి అధికారుల ప్రణాళికలు



కుప్పం మున్సిపల్ కార్యాలయం

కుప్పం: మున్సిపాలిటీ ఆదాయం పెంచుకునేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గ్రేడ్–2 మున్సిపాలిటీగా కుప్పానికి ఆదాయం పెంపు దిశగా అధికారులు శ్రీకారం చుట్టారు. పట్టణానికి దూరంగా ఉన్న గ్రామాలను తొలగించి సమీపంలో ఉంటూ అభివృద్ధి చెందుతున్న గ్రామాలను చేర్చి తద్వారా ఆదాయం పెంపు మార్గాలను అన్వేషిస్తున్నారు. దీంతోపాటు ప్రధానంగా పీఈఎస్ మెడికల్ కళాశాల మున్సిపాలిటీ పరిధిలోకి తెచ్చేలా అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

తొలగనున్న గ్రామాలు

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 2వ వార్డులోని సామగుట్టపల్లె పంచాయతీలోని నాలుగు గ్రామాలు పట్టణానికి దూరంగా వున్నాయి. అంతేకాకుండా అటవీ సరిహద్దులో ఉండడం వలన వీటిని మున్సిపాలిటీలో కలపడంతో ప్రజలకు ఇబ్బందులతో పాటు అభివృద్ధి పనులను ఆటంకంగా మారుతోంది. చీగలపల్లె, యలాజనూరు, చిన్నచీగలపల్లె, నారాయణపురం గ్రామాల ప్రజలు సైతం మున్సిపాలిటీ పన్నులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు బేవనదీలేపల్లె పరిధిలోని పరమసముద్రం, పలార్లపల్లె, చీలేపల్లె గ్రామాలను మున్సిపాలిటీ నుంచి తొలగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈగ్రామాల్లో మున్సిపాలిటీ సిబ్బందితో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలంటే ఇబ్బందికరంగా మారింది. దీంతో వీటిని పంచాయతీలుగా మార్పు చేయాలని ప్రస్తుతం మున్సిపాలిటీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

మున్సిపాలిటీలో చేరనున్న పంచాయతీలు

కుప్పం మున్సిపాలిటీకి ఆనుకుని వున్న గుడుపల్లె మండలానికి చేరిన గుండ్లసాగరం శెట్టిపల్లె, బెగ్గిలిపల్లె పంచాయతీలను మున్సిపాలిటీలో చేర్చేందుకు శ్రీకారం చుడుతున్నారు. పీఈఎస్ మెడికల్ కళాశాల బెగ్గిలిపల్లె పంచాయతీలో ఉండడంతో ప్రభుత్వానికి ఆదాయం పన్నుల రూపంలో పెరగనుంది. ఈ మూడు పంచాయతీలు పట్టణానికి ఆనుకుని ఉండడమే కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటోంది. రియల్ ఎస్టేట్ లేఔట్ల వల్ల పంచాయతీకి వస్తున్న పన్నులు మున్సిపాలిటీకి తీసుకొచ్చి మున్సిపాలిటీ గ్రేడింగ్‌ను పెంచాలని అధికార యంత్రాంగం యోచన. ఇందులో భాగంగా పూర్తి స్థాయిలో మున్సిపాలిటీకి ఆదాయం పెంచే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.